నేటి నుంచి 'గంగమ్మ' ఆలయ పునరుద్ధరణ

వచ్చే ఏడాది 'జాతర'కే పునర్దర్శనం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయం శనివారం నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 9 తేదీ వరకు మూసివేస్తున్నట్లు ఆలయ అధికారులు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. అమ్మవారి ఆలయ పునరుద్ధరణలో భాగంగా శుక్రవారంఒక్కరోజు మాత్రమే అమ్మవారి మూలవిరాట్ దర్శనం జరిగింది. మరో ఆరు నెలలు అంటే వచ్చే సంవత్సరం 2023 గంగ జాతర వరకు అమ్మవారి మూలవిరాట్ దర్శనం ఉండదు. బాలాలయంలో ప్రాణ ప్రతిష్ట చేసిన గంగమ్మ ప్రతిమ మాత్రమే భక్తులకు దర్శనమిస్తుంది. కావున తిరుపతి పుర ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

కన్నబిడ్డలా సాకిన... 'పప్పీ'కి కడసారి వీడ్కోలు

- ఊరంతా ఫ్లెక్సీలు, అన్నదానం
- శునకం కర్మక్రియల్లో 'బుర్రకథ'

ఆ తల్లిదండ్రుల మానవత్వానికి వందనం.. బిడ్డలంటేనే అపురూపం.. ఎంత ఖర్చయినా బాధ్యతగా పెంచి పెద్దచేస్తాం.. అందునా అమ్మ ప్రేమను అస్సలు నిర్వచించలేం. రక్తం పంచుకు పుట్టిన బిడ్డలకు ఏమైనా జరిగితే అమ్మ తట్టుకోలేదు. ఇది అందరికీ తెలిసిన సత్యం. కన్నపేగు బంధం ఎలా ఉంటుందో...అదే తరహాలో ఓ దిగువ మధ్యతరగతి స్థాయి దంపతులు తమ పెంపుడు శునకం విషయంలో చూపి అందరి దృష్టిని ఆకర్షించారు. అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన తమ పెంపుడు శునకం పప్పీకి సాంప్రదాయ పద్ధతిలో మంగళ వాయిద్యాలు, మేళ తాళాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. అంతేకాదండోయ్. పప్పీకి కర్మక్రియలు జరిపారు. కర్మక్రియల సందర్భంగా ఊరంతా పప్పీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వందలాది మందికి అన్నదానం చేశారు. పప్పీ ఆత్మశాంతి కోసం జానపద కళాకారులచే బుర్రకథ చెప్పించారు. అందుకే ఆ దంపతుల మానవత్వానికి అందరూ సలాం చెబుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి రూరల్ మండలం రాందాస్ 250 నగర్‌లో నివసించేవారంతా కార్మికులే. సి.రాధ, సి.శ్రీనివాసరెడ్డిలకు సంతానం లేదు. కుక్కపిల్ల పప్పీకి 12 ఏళ్ల క్రితం రెండు కాళ్లు విరిగిపోవడంతో యజమాని రోడ్డుపైన వదిలేశాడు. బిఎస్ఎన్ఎల్‌కార్యాలయంలో శ్రీనివాసరెడ్డి ఎన్ఎంఆర్‌గా పనిచేస్తున్నాడు. రాధ రైల్వే పారిశుధ్య కార్మికురాలు. రాధకు కాలు ఫ్రాక్చర్ కావడంతో పనికి వెళ్లడం మానేసింది. కాలనీలోనే కిరాణా కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలోనే రెండు కాళ్లు విరిగిపోయిన శునకం (పప్పీ)ను ఓ షావుకారు రోడ్డుపైన వదిలేశాడు. అటువైపు వెళుతున్న శ్రీనివాసరెడ్డి ఇంటికి తీసుకొచ్చాడు. వెనక రెండు కాళ్లు విరిగిపోయాయి. భార్యాభర్త మాట్లాడుకుని బిడ్డమాదిరి పెంచుకుందామని మాట్లాడుకున్నారు. ఈ కుక్కకి కాలు నయం చేయాలని అందరినీ అడిగారు. వెటర్నరీ కాలేజీకి తీసుకెళితే బాగవుతుందని చెప్పారు. వైద్యులు ఆపరేషన్ చేసి రాడ్‌లు పెట్టి సర్జరీ చేశారు. నెలరోజుల్లో కుక్క బాగా కోలుకుని చలాకీగా ఉండేది. ఏం చెప్పినా అర్థం చేసుకుని ఇంట్లో పనులు చేసి పెట్టేది. వంటగదిలో ని వ వా న ల్లు అందించేది. టీవీ పెట్టమని చూపించేది. అన్ని సైగల ద్వారా బిడ్డలా చూసుకునేవారు. అపురూపంగా సాకారు. పప్పీ నలుగురు బిడ్డలకు జన్మనిచ్చింది. ఇటీవల అనారోగ్యం పాలవడంతో వెటర్నరీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. శునకానికి 12 ఏళ్లు దాటాయని, బతకడం కష్టమని, ఆరోగ్యం క్షీణించిందని చెప్పడంతో కన్నీరుమున్నీరయ్యారు. ఎలాగైనా బతికించాలని కోరారు. మందులు తినిపిచ్చినా ఫలితం లేకపోయింది. నవంబర్ 23న చనిపోయింది. కన్నబిడ్డకంటే ఎక్కువగా చూసుకున్న ఆ తల్లిదండ్రులు పప్పీ చనిపోవడంతో శోకసంద్రంలో మునిగిపోయింది. కన్నబిడ్డకు ఏ విధంగా దహన సంస్కారం చేసి ఉంటామని భావించి అలాగే చేయాలని భర్తను కోరింది. శ్రీనివాసరెడ్డి సైతం అంగీకరించి 'నీ కోర్కె నా కోరిక' అంటూ పాడె కట్టి సాంప్రదాయబద్ధంగా డప్పులు, మంగళవాయిద్యాలతో అంతిమసంస్కారం నిర్వహించారు. పప్పీకి ఆత్మశాంతించాలంటే కర్మక్రియలు చేయాలనుకున్నారు. 70వేలు ఖర్చు చేసి రాందాస్ కాలనీనే కాకుండా చుట్టుపక్కల కాలనీవాళ్లందరినీ ఆహ్వానించారు. 'మా పప్పీ (బంగారం) కర్మక్రియలకు అందరూ రండి' అని బ్యానర్లు కట్టారు. కుక్కకు కర్మక్రియలు ఏంటని అందరూ వచ్చారు. చికెన్ బిరియాని, చికెన్, అన్నం, సాంబారు, రసంతో దాదాపు 500 మందికి అన్నదానం చేశారు. కొంతమంది పప్పీకి ఆత్మశాంతించాలంటే 'బుర్రకథ' చెప్పించాలని చెప్పడంతో 15వేలు ఖర్చు చేసి బుర్రకథను గంగమ్మ గుడి వద్ద చెప్పించారు. వచ్చిన జనాలు 'పప్పీకి' ఆత్మశాంతి కలగాలంటూ మైకులో విన్నవించుకోగా క్యూలో వచ్చి ప్రతి ఒక్కరూ 'పప్పీ' చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. మానవత్వానికి మచ్చుతునక ఈ ఘటన.

కర్మక్రియల సందర్భంగా శునకానికి నివాళి

రాష్ట్ర పతి పర్యటన సందర్భంగా ఉన్నతాధికారులతో కలెక్టర్ పర్యవేక్షణ

రాష్ట్రపతి పర్యటన విజయవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, రేణిగుంట

ఈనెల 4, 5 తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయంలో ఎస్‌పి పరమేశ్వరరెడ్డి, జేసీ డికె బాలాజీతో కలిసి రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై సూచనలు చేశారు. రాష్ట్రపతి మొదటిసారిగా తిరుపతి జిల్లాలో పర్యటించనున్నారని, అందుకు తగిన ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. ఆదివారం సాయంత్రం విశాఖపట్నం నుంచి బయల్దేరి రాత్రి 8.40 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని తిరుమలలో బస చేస్తారు. సోమవారం ఉదయం శ్రీ వరాహస్వామిని, తిరుమల శ్రీవారిని దర్శించుకుని, 10 గంటలకు అలిపిరి వద్దగల గోమందిరాన్ని, 11 గంటలకు పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం చేరుకుని మహిళా సాధికారితపై స్టాల్స్‌ను సందర్శించి ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో విద్యార్థులతో, ప్రొఫెసర్లతో ముఖాముఖి నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని ఢిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున డిప్యూటీ సిఎం కె.నారాయణస్వామి భారత రాష్ట్రపతికి అధికారిక స్వాగతం పలకనున్నారు. భారత రాష్ట్రపతి పర్యటనలో భద్రత , వాహనాలు, అంబులెన్స్, ఫైర్ సర్వీసెస్ ఏర్పాట్లను సంబంధిత శాఖలు రాష్ట్రపతి కార్యాలయం నుండి అందిన నిబంధనలను పాటించాల్సి ఉంటుందని సూచించారు. అలాగే రాష్ట్రపతి కార్యాలయం నుండి అనుమతించిన జాబితా మేరకు ప్రముఖులు స్వాగతం పలకనున్నారని అన్నారు. అనంతరం రేణిగుంట విమానాశ్రయము నుండి భారత రాష్ట్రపతి ప్రయాణించనున్న ప్రదేశాలు తిరుమల, అలిపిరి వద్ద గో మందిరం ,శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ లను ముందస్తు వాహన శ్రేణి లో ప్రయాణించి ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం రాష్ట్రపతి పర్యటన విధులలో పాల్గొంటున్న అధికారులతో మరొకసారి సమావేశమై దిశా నిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో సీవి అండ్ ఎస్ ఓ నరసింహ కిషోర్, అదనపు ఎస్పి కులశేఖర్, తిరుమల ఏ ఎస్ పి మునిరామయ్య, ఏ ఎస్ పి విమల కుమారి, ఎయిర్పోర్ట్ డైరెక్టర్ రాజ్ కిషోర్, ఆర్డీవో లు శ్రీకాళహస్తి రామారావు, తిరుపతి కనక నరసారెడ్డి, ఏర్పోర్ట్ సి ఎస్ ఓ రాజశేఖర రెడ్డి, డిప్యూటీ కమాండెంట్ శుక్లా, డిఎం అండ్ హెచ్ ఓ శ్రీహరి, రేణిగుంట తహసిల్దారు శివప్రసాద్ పాల్గొన్నారు.



బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఎంపి గురుమూర్తి

బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ సమస్యను పరిష్కరించండి : ఎంపి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ సమస్య లేకుండా సక్రమంగా పనిచేసేలా చూడాలని ఎంపి డాక్టర్ గురుమూర్తి అన్నారు. శుక్రవారం తిరుపతి బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో టెలికం సలహా కమిటి సమావేశం చిత్తూరు ఎంపి రెడ్డెప్పతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేయనున్న సెల్‌టవర్ల గురించి చర్చించారు. కొన్ని ప్రాంతాల్లో సిగ్నల్స్ అందక అత్యవసర సమయాల్లో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, అలాంటి ప్రాంతాలను గుర్తించి త్వరితగతిన సెల్‌టవర్లను ఏర్పాటు చేయాలన్నారు. నెట్‌వర్కు విషయంలో కానీ, సాంకేతికత విషయంలో కానీ ప్రైవేట్ టెలికం ఆపరేటర్లతో పోటీపడే స్థాయికి బిఎస్ఎన్ఎల్ ఎదగాలన్నారు. తిరుపతి జిల్లా గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల పరిధిలోని పులికాట్ పరిసర ప్రాంతాల్లోనూ, సముద్రతీరాన ఉన్న గ్రామాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థ లోపభూయిష్టంగా ఉందని, ఈ ప్రాంతాలలో సిగ్నల్స్ పెంచేందుకు కొత్త టవర్ల నిర్మాణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్, టెలికం అడ్వైజరీ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రోగులకు పౌష్టికాహారం పంపిణీ

తిరుపతి టౌన్ : ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతిలోని రుయా హాస్పిటల్ నందు హెచ్ఐవి పిల్లలకు పోషక విలువలు కలిగిన న్యూట్రిషన్ ఫుడ్, ఫుడ్ గ్రైన్స్ ను తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షులు బి .మునికష్ణ నాయుడు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు .దాదాపు 15 వేల రూపాయల విలువ చేయు పోషక ఆహార వస్తువులను క్లబ్బు తరపున ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవలో చాలా సంతప్తి ఉందన్నారు. ఈ రోజు ఇక్కడ ఈ పిల్లలను చూసి మనసు చలించిపోయిందన్నారు .చక్కటి బాల్యాన్ని అందరు పిల్లలతో ఆనందంగా గడపాల్సిన వయసులో హెచ్ఐవి బారిన పడి బాధపడుతున్న పిల్లలను చూసి చాలా బాధ కలిగిందన్నారు. ఇటువంటి పిల్లలకి అవసరమైన న్యూట్రిషన్ ఫుడ్ అందించడం చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు. అనంతరం పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్ బ్యాగులను ఉచితంగా అందించారు. తిరుపతి డిస్ట్రిక్ట్ అడిషనల్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అరుణ సులోచన , లయన్స్ క్లబ్ కార్యదర్శి చిత్రా మోహన్, ట్రెజరర్ ముబారక్ భాషా ,డిస్టిక్ క్యాబినెట్ అదనపు కార్యదర్శి కె. రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందిస్తూ...

15న మిక్స్‌డ్ బియ్యం టెండర్ కమ్ వేలం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారికి భక్తులు సమర్పించిన మిక్స్‌డ్ బియ్యం టెండర్ కమ్ వేలం డిసెంబరు 15న తిరుపతిలోని మార్కెటింగ్ విభాగం కార్యాలయంలో జరగనుంది. మొత్తం 12,880 కిలోల బియ్యాన్ని వేలానికి సిద్ధంగా ఉంచారు. రూ.590 డిడి తీసి టెండరు షెడ్యూల్ పొందొచ్చు. వేలంలో పాల్గొనేందుకు రూ.25వేలు ఇఎండిగా చెల్లించాలి. ఇతర వివరాల కోసం మార్కెటింగ్ విభాగం జనరల్ మేనేజర్(వేలం)వారి కార్యాలయాన్ని 0877-2264429 ఫోన్ నంబరులో సంప్రదించాల్సి ఉంది.

మొదటి ఘాట్‌లో అక్కదేవతల పూజ

తిరుమల : మొదటి ఘాట్ రోడ్డులో గల అక్కదేవతల గుడిలో ఏడుగురు అక్కదేవతలకు శుక్రవారం పూజ ఘనంగా జరిగింది. టిటిడి రవాణా విభాగం ఆధ్వర్యంలో ఉదయం జరిగిన ఈ పూజ కార్యక్రమంలో టిటిడి ఈఓ ఎవి.ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కదేవతల గుడిని పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నడకదారి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి రవాణా విభాగం జనరల్ మేనేజర్ శేషారెడ్డి, డిఐలు జానకిరామిరెడ్డి, మోహన్, డ్రైవర్లు, రవాణా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఓట్ల పరిశీలన చేయాలి :కమిషనర్

తిరుపతి టౌన్ : క్షేత్రస్థాయిలో బిఎల్ఒలు ఓట్లు పరిశీలించాలని కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. శుక్రవారం ఎస్‌వియులోని శ్రీనివాస ఆడిటోరియంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు తిరుపతి నియోజక వర్గాలలో ఇప్పటికే అందిన ఫారం-6, 7 మేరకు క్షేత్ర స్థాయిలో బి.ఎల్.ఓ లు రానున్న ఆరు రోజులు ఉదయం ఆరు నుండే పరిశీలనకు వెళ్ళాలని సూచించారు. జనాభా ప్రాతిపదికన ఓటర్ల జాబితా, 18 సంవత్సరాల యువత నమోదు చూడాలని అన్నారు. కళాశాలలో మరొకసారి డ్రైవ్ నిర్వహించి ఓట్లు నమోదు చేయాలన్నారు. పెండింగ్ ఫారం 6, 7 దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు డిసెంబర్ 8 నాటికి పెండింగ్ లేకుండా అన్ని దరఖాస్తులు పూర్తి కావాలని అన్నారు. 2023, జనవరి 5 న ప్రకటించిన ఓటర్ల జాబితా తప్పులు లేని పారదర్శకత గా వుండాలని అన్నారు.

తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవం : డాక్టర్ సుధారాణి



తిరుపతి టౌన్ : తుమ్మలగుంట నలందనగర్‌లోని శ్రీసాయిసుధా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శుక్రవారం తల్లిదండ్రుల వందనోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో చిన్నారులు వారి తల్లిదండ్రులకు పాదపూజ చేసి వారి ఆశీర్వాదాలను అందుకున్నారు. పిల్లల కోసం సర్వం త్యాగం చేసే తల్లిదండ్రులను చివరి వరకూ కంటికి రెప్పలా పిల్లలు కాపాడుకోవాలని కరస్పాండెంట్ డాక్టర్ సుధారాణి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, టీచర్లు ప్రశాంతి, పుష్ప, ప్రవీణ్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారిని విశాఖపట్నం ఎమ్మెల్యే గణబాబు, తెలంగాణ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య లు దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. టిటిడి ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అభిషేక సేవలో భాజపా నేత సీఎం రమేష్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మహారాష్ట్ర ఎంపీలు శ్రీకాంత్, హేమంత్ పాటిల్ లు స్వామివారి సేవలో పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఈవో

ప్రజాశక్తి -తిరుమల

డయల్ యువర్ ఈవో కార్యక్రమం శనివారం ఉదయం 9 నుండి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డి తో ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చు. ఇందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877-2263261.

'కరువు' పనికి కూలేది..?

నాలుగు నెలలుగా అందని బిల్లులు
బకాయి రూ.37 కోట్ల పైమాటే..!!
'ఉపాధి' కూలీలకూ తప్పని నిరీక్షణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో 'నిరీక్షణ' అన్నది షరా'మామూలే'... స్కీం వర్కర్లు బిల్లుల కోసం నిరీక్షించాలి.. వేతన జీవులూ వేతనాల కోసం ఎదురుచూడాలి.. కాంట్రాక్టర్లు ఏళ్ల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఉండాలి.. చివరకు 'ఉపాధి' కూలీలకు అష్టకష్టాలు తప్పడం లేదు.. రెక్కాడితే గాని పూటగడవని ఉపాధి కూలీలకు నాలుగు నెలలుగా బిల్లులు నిలిచిపోయి కూలి అందక వారి బాధలు వర్ణనాతీతం. తిరుపతి జిల్లాలో నాలుగు నెలలకు సంబంధించి దాదాపు రూ.37 కోట్ల రూపాయలు రావాల్సి ఉంది.

ప్రతి నిరుపేద కుటుంబానికీ చేతి నిండా పనీ..మూడు పూటలా తిండి పెట్టాలనే గొప్ప సంకల్పంతో వామపక్షాల ఒత్తిడి మేరకు ఆ నాటి కేంద్ర ప్రభుత్వం 2005లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2007 నుంచి ఉపాధి హామీ పథకం అమల్లో ఉంది. ఇంతవరకు బాగానే ఉన్నా చేసిన పనికి సకాలంలో బిల్లులు చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 'చేతినిండా పని ఉన్నా పైసలు మాత్రం సున్నా' అన్న చందాన తయారవుతోంది నానాటికీ ఉపాధి కూలీల పరిస్థితి. రెండేళ్ల కిందట కోర్టు మొట్టికాయలు వేస్తే గానీ వైసీపీ సర్కారు ఉపాధి బిల్లులు చెల్లించలేదు. పైగా ఉపాధి బిల్లులను దారి మళ్లించి సంక్షేమ పథకాలకు వాడుకున్నారన్న అపవాదునూ మూటగట్టుకుంది. ఈ నేపథ్యంలో కేంద్రమే రంగంలోకి దిగి ఉపాధి బిల్లులను నేరుగా కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. అయినా ఈ ఏడాది ఆగస్టు నుంచి ఉపాధి పనులు చేసిన కూలీలకు బిల్లులు చెల్లించ లేదు. దీంతో నాలుగు నెలలుగా బిల్లులు కోసం ఎదురు చూస్తూ కూలీలు ఆపసోపాలు పడాల్సి వస్తోంది.

బకాయిలు రూ.37 కోట్ల పైమాటే..!!

తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాల్లో ఉపాధి పనులకెళ్లేవారు అధికమనే చెప్పాలి. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పద్ధతులు కొత్త పుంతలు తొక్కుతుండటంతో అక్కడ పనిలేక చాలా మంది వ్యవసాయ కార్మికులు ఉపాధి పనుల వైపే

మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టు నుంచి నవంబరు వరకు ఈ నాలుగునెలల కాలంలో తిరుపతి జిల్లాలోని 34 మండలాల వ్యాప్తంగా 1.88 లక్షల కుటుంబాలు ఉపాధి పనుల్లో పాలు పంచుకున్నారు. 18.77 లక్షల పనిదినాలను చేశారు. వీరికి చేసిన పనికి గాను కూలీ సుమారు రూ.37.55 కోట్లు రావాల్సి ఉంది. అయితే నాలుగు నెలలు గడుస్తున్నా నయాపైసా కూడా బ్యాంకు ఖాతాల్లో జమకాకపోవడంతో కూలీలు సతమతమవుతున్నారు. కొందరు బిల్లులు పడ్డాయో? లేదో చూసేందుకు నిత్యం బ్యాంకులు చుట్టూ తిరుగుతూ అలసిపోతుండటం గమనార్హం. గతంలో టాటా కన్సల్టెన్సీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి బిల్లుల చెల్లింపులు చేసేది. అయితే రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు రావడంతో కేంద్రం ఎన్ఐసీ సంస్థ ద్వారా కూలీల ఖాతాలకు నేరుగా బిల్లులు జమచేస్తోంది. మరి నాలుగు నెలలుగా బిల్లులెందుకు చెల్లించ లేదో అంతుబట్టని పరిస్థితి. ఒక వైపు వైసీపీ సర్కారేమే తాము ఉపాధి బిల్లులు చెల్లించేందుకు రూ.386 కోట్లు మంజూరు చేశామనీ ప్రకటనలు చేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఐదు విడతలుగా రూ.3675 కోట్లు చెల్లించామనీ, ఆరో విడతలో విడుదల చేసిన రూ.386 కోట్లను కలుపుకుని మొత్తంగా రూ.4061 కోట్లు మంజూరు చేసినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కోన శశిధర్ గత నెల 29న ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ఇప్పటికి ఐదు రోజులు కావస్తున్నా ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాల్లో బిల్లులు జమకాకపోవడం బాధాకరం.

- **అలవెన్సులూ ఎత్తేసిన కేంద్రం**

ఉపాధి పనులపై కరపెత్తనం చేస్తున్న మోదీ సర్కార్ సకాలంలో కూలీలకు బిల్లులు చెల్లించకపోగా సమ్మర్ అలవెన్సులను ఎత్తేసింది. 2021లో సమ్మర్ అలవెన్సు రూ.50 శాతం చెల్లిస్తుండగా 2022లో అలవెన్సులకు మొండి చెయ్యి చూపింది. అంతేకాకుండా పనిప్రదేశంలో నీడ, నీరు, ప్రథమ, చికిత్స పెట్టెలు కూడా లేకుండా చేసేసింది. ఫలితంగా మధ్యాహ్నం వరకు చెమటోడ్చినా కూలీ రూ.150 కూడా గిట్టని పరిస్థితి కూలీలకు ఏర్పడుతోంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించడంతో పాటు సమ్మర్ అలవెన్సులు, పనిప్రదేశాల్లో నీడ, నీరు, ప్రథమ చికిత్సా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

- **పస్తులుంటున్నాం: నాగరాజు, కాళంగి, ఉపాధి కూలీ.**

కోవిడ్ కారణంగా ఉద్యోగం పోయింది. ఊళ్లో వ్యవసాయ పనులకూ ఎవరూ పిలవడం లేదు. దీంతో ఉపాధి పనులనే నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నా. నాలుగు నెలలు గడుస్తున్నా రూపాయి కూడా ఖాతాలో జమకాలేదు. అప్పులు చేసి తిండి గింజలు కొంటున్నా. ఇకనైనా బిల్లులు పడకుంటే పస్తులుండాల్సిందే.

ఈ నెల 5లోపు బిల్లులు

ప్రేమ్‌కుమార్, డ్వామా ఏపీడీ, శ్రీకాళహస్తి

నాలుగు నెలలు ఉపాధి బిల్లులు పెండింగ్‌లో ఉన్నమాట వాస్తవమే. ఇటీవలే బిల్లులు విడుదల చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 5వ తేదీ లోపు బిల్లులు ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాల్లో జమయ్యే అవకాశం ఉంది.

ఆశా వర్కర్స్ జిల్లా మహాసభల కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట సిఐటియు కార్యాలయంలో ఆశా వర్కర్ల జిల్లా మహాసభ కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారానికై ఈ జిల్లా మహాసభ వేదికగా ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు సుజాత,ఎస్ కె.పర్వీన్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు గోపాల్, సిఐటియు నాయకులు చాపల.వెంకటేశ్వర్లు, శివకవి.ముకుంద, కుమార్‌లు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్

రాష్ట్ర మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: ఈ నెల 7, 8 తేదీల్లో ఒంగోలులో జరగనున్న పుత్తూరు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల గోడపత్రికలను శుక్రవారం రాష్ట్ర అధ్యక్షులు జె.రామచంద్రయ్య ఆధ్వర్యంలో పుత్తూరు మున్సిపల్ కార్యాలయం దగ్గర ముత్తుస్వామి గుడివద్ద యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు డి.మహేష్, టి.విజయ్, ఎన్.హరినాథ్, పి.యాకోబ్, పి.చలపతి, గోవింద్ స్వామి, మణెమ్మ, వజ్రమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కెవిబిపురం: మండలంలోని సిఐటియు సంఘంలోని పలు కార్మిక సంఘాల నుండి హాజరైన వారిలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా నాయకులు దాసరి జనార్ధన్ తెలిపారు . శుక్రవారం నాడు మండల కేంద్రమైన కేవీబిపురంలో సిఐటియు మండల కమిటీకి అధ్యక్షులుగా పి.కల్పన, ప్రధాన కార్యదర్శిగా నాగలాపురం నాగరాజు, ఉపాధ్యక్షులుగా ఎం.రాజేశ్వరి, జ్యోతి మణి, సహాయ కార్యదర్శిగా, పి.వెంకటేశ్వర్లు, రవి, కార్యవర్గ సభ్యులుగా, రమణమ్మ, భారతి, పూర్ణమ్మ, శంకర్ నాగయ్య, రామయ్య, కన్నెమ్మ, కాటయ్య, ఢిల్లీ, అంబిక, వెంకటేశ్వర్లు, ఎం.రమణమ్మ, కన్నమ్మ, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11, 12 తేదీలలో తిరుపతిలో జరిగే ప్రథమ జిల్లా మహాసభలలో మండలంలోని అసంఘటితరంగ కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మానవత్వం చాటుకున్న ఏఎస్ఐ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-బిఎన్‌కండ్రిగ: మండలంలోని పిల్లేటివారి కండ్రిగ పంచాయతీకి చెందిన యనమల స్వరూప శ్రీకాళహస్తికి చెందిన వంశీ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతుంది. కళాశాల ముగించుకుని తిరిగి ప్రయాణంలో శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆమె బ్యాగు మిస్ అవ్వడంతో శ్రీకాళహస్తి ఏపీఎస్ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఏఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఆమె బ్యాగు దొరికింది. ఆ బ్యాగులో స్వరూపాకు సంబంధించిన రూ.200 బస్సు పాసు, ఐడి కార్డు, లంచ్ బాక్స్, ఆమెకు తిరిగి ఇచ్చారు. వెంకటేశ్వర్లు మానవత్వం చూసి ఆ విద్యార్థిని తండ్రి గ్రామ సర్పంచ్ అయిన ప్రసాద్ పాల్ వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- కేవిబిపురం: మండలంలోని ఐకెపి భవనంలో శుక్రవారం 39 పంచాయితీల్లో పనిచేస్తున్న సిఆర్‌పిలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిపిఎం మునిరత్నం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం చేయడం వలన రైతులకు అప్పుల బాధ నుండి బయటపడవచ్చునని తెలిపారు. పొలాలు సారవంతంగా ఉండి మంచి దిగుబడిని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు

ఆర్డీఓని కలిసిన ఎంపీపీ

ప్రజాశక్తి-బాలాయపల్లి :గూడూరు డివిజన్ ఆర్డీవో కిరణ్‌కుమార్‌ని తిరుపతి జిల్లా బాలాయపల్లి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు గూడూరు భాస్కర్ రెడ్డి శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో భూమి సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటికి సామరస్యంగా పరిష్కార మార్గం చేపట్టాలని కోరారు. ఇక మండలంలోని వాక్యాం గ్రామంలో ఇరుగ్రూపులకు చెందిన వారికి నష్టం జరగకుండా ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని చెప్పారు. ఇక జయంపు గ్రామ సమస్యలపై ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా మరి కొన్ని గ్రామాలలో వ్యవసాయ పొలాల్లోకి వెళుతున్న దారుల సహితం ఆక్రమణ జరిగిందని చెప్పారు. రైతుల కష్టాలు తీర్చాలని కోరారు. ఇక వరవ కాలువల ఆక్రమణలపై ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని తెలియజేశారు. ఆయన వెంట ఎన్ఆర్ఐ సురేష్ యాదవ్, బాలాయపల్లి సహకార సంఘం అధ్యక్షుడు కరణం రమేష్ నాయుడు, ఉన్నారు.

రేపు కార్తీక వనభోజన కార్యక్రమం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈ నెల 4వ తేదీ శ్రీ వీరభద్ర రజక సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రామాపురం ప్రధాన మార్గంలోని నిషాల్ కన్వెన్షన్‌లో కార్తీకమాస వనభోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్తీకమాస వనభోజన ఆహ్వాన కమిటీ ఛైర్మన్ గంధం బాబు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఉత్సహంగా సాగడానికి మహిళలకు మ్యూజికల్ ఛైర్స్, లెమన్ స్పూన్, పిల్లలకు డాన్స్ పోటీలు, లక్కీడిప్ లో పట్టుకుంటే పట్టుచీర వంటి కార్యక్రమాలు చేస్తామని, విజేతలకు 20 వేలు విలువ చేసే బహుమతులు అందజేస్తామన్నారు. రజకులలో సేవా కార్యక్రమాలు చేసే 45 మందికి శ్రీ సంత్ గాడ్ కే బాబా సేవా పురస్కారాలను అందిస్తామన్నారు. గంధం వెంకటముని, సుధాకర్, కరాటే చంద్ర, కందారపు చిరంజీవి, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి-పాకాల:ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పాకాల మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా యం. బాబు నాయుడు, జి.శ్రీధర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులుగా విచ్చేసిన జిల్లా కోశాధికారి పత్తిపాటి రమేష్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా సి.సురేష్ వ్యవహరించారు. మండల గౌరవ అధ్యక్షుడిగా డి.బాలసుబ్రమణ్యం, అసోసియేట్ అధ్యక్షులుగా టీ.తులసమ్మ, కె.సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా ఎస్.రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అన్నారు. మండల కార్యదర్శులుగా వి.సుధాకర్, ఏ.వరలక్ష్మి, జి అబ్దుల్ సమద్, పి.సుభాష్ చంద్రబోస్, వి. కుసుమ, పి మీన, జి రెడ్డమ్మ, జిల్లా కౌన్సిలర్లుగా జి శివప్రసాద్, కె.మేనక, కే.రాజేష్, కె.ఖాదర్ వలీ ఎన్నికైనట్లు తెలిపారు.



దర్గాగా ప్రభుత్వ భూమి కబ్జా

- కన్నెత్తి చూడని రెవెన్యూఅధికారులు
- ఆందోళనలో లబ్ధిదారులు

ప్రజాశక్తి-రేణిగుంట: మండలంలో ఇటీవల కాలంలో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయి. ఎవరు ఎన్ని ఫిర్యాదులు చేసినా స్పందించే వారే కరవయ్యారు. కోట్లకు విలువ చేసే భూములు కబ్జాలకు గురవుతున్నా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో చిదంబర రహస్యంగా మారింది. ఈ క్రమంలో నిత్యం ప్రముఖులు రద్దీ ఉండే విమానాశ్రయం నుంచి పూతలపట్టు నాయుడుపేట ప్రధాన రహదారి కలిసే ప్రాంతంలో కోట్లకు విలువ చేసే భూమి కబ్జాకు గురైంది. కరకంబాడి లెక్క దాఖల్లోని సర్వేనెంబర్ 453/6లో 6.7 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిపై స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు కన్నేశారు. తమ వద్ద పాత రికార్డులు ఉన్నాయని వాటి ఆధారంగా ఇక్కడ తమ స్థలాలు అమ్ముతున్నామని స్థానికులు నమ్మించారు. సుమారు ఐదు లక్షలు చొప్పున రెండు సెంట్లు భూమిని సుమారు 34 మందికి విక్రయించారు. ఈ లెక్కన వారు 1.50 కోటి రూపాయలు తమ జేబుల్లో వేసుకున్నారు. వీటిని కొన్న పేదలు పట్టా ఎక్కడా అని అడిగితే మీరు ఇల్లు పూర్తి చేసిన తర్వాత పట్టా లిస్తామని చెబుతున్నారు. అయితే ఈ అంశంపై కొందరు రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేయగా వారు ఇంతవరకు స్పందించ లేదని ఇటీవల కాలంలో రెవెన్యూ అధికారుల అండదండలతో ఇష్టాను సారంగా కబ్జాలు జరుగుతున్నాయని అనేక మంది విమర్శిస్తున్నప్పటికీ దున్నపోతు మీద వర్షం కురిసినట్టు రెవెన్యూ అధికారులు వ్యవహరి స్తున్నారని స్థానికులు వాపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులే విచారించి చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటించాలి

జిల్లా కో-ఆర్డినేటర్ నరసింహులు

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్: నీటిని కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సుస్థిరాభివృద్ధి లక్ష్యాల జిల్లా కోఆర్డినేటర్ నరసింహులు, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి పేర్కొన్నారు. పురపాలక సంఘం పరిధిలోని వైఎస్సార్ సమావేశ మందిరంలో సిఆర్‌డి వారు ఫిష్ వాష్ కార్యక్రమంలో కమిషనర్ కె.యల్.యన్.రెడ్డి, ఛైర్మన్ ఆనంగి హరి, వైస్ ఛైర్మన్‌లు డి.జయప్రకాష్, అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మునిసిపల్ కౌన్సిలర్లు, ఎంఈఓ తిరుమలరాజు, సచివాలయ కార్యదర్శులు, మెప్మా, మునిసిపల్ సిబ్బంది, యూనిసెఫ్ వారు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల జిల్లా కో-ఆర్డినేటర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని లేనిచో వివిధ రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఛైర్మన్ హరి మాట్లాడుతూ ప్రతిరోజు పరిశుభ్రమైన నీటిని, వేడి చేసి చల్లార్చి తాగితే మంచిదన్నారు. వైస్ ఛైర్మన్ డీ.జయప్రకాష్ మాట్లాడుతూ భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉండడానికి గల కారణాలను, వాటిని అధిగమించడానికి గల పరిష్కారాలను పేర్కొన్నారు. ఎంఈఓ తిరుమలరాజు మాట్లాడుతు నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలలో కల్పించిన నీటి సదుపాయం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాష్ పిఓఆర్‌డి ఫౌండేషన్ కోఆర్డినేటర్ లలితమ్మ, మెప్మా, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ అండ్ బి నిర్లక్ష్యం తగదు: తహశీల్దార్

ప్రజాశక్తి -బాలాయపల్లి : ఆర్ అండ్ బి నిర్లక్ష్యం తగదని తహశీల్దార్ అజ్మతుల్లా ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయాల వారోత్సవాల జరిగాయి. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్ రెడ్డి తమ పాఠశాల ముందు ఉన్న స్పీడ్ బ్రేకర్‌ను వాహనదారులు గుర్తించ కపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతు న్నాయని మండల శాఖ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు. ఈ సమస్యను ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ వాళ్ల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోవడం లేదని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్పీడ్ బ్రేకర్ వద్ద ఎటువంటి సమాచారం బోర్డులు లేక పోవడంతో ప్రమాదాల జరుగుతున్న విషయం తెలిసినా ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవీంద్ర రెడ్డి కోరిక మేరకు శుక్రవారం తహశీల్దార్ అజ్మతుల్లా ఖాన్, ఎంపీడీఓ వినీల్ కుమార్, ఎస్ఐ సుధాకర్ రెడ్డి, సర్పంచ్ దట్టం అంజలి, పంచాయతీ కార్యదర్శి లీలావతి, కాంట్రాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు సహకారంతో బాలాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు రోడ్డు మార్గంలో వాహనదారులకు స్పీడ్ బ్రేకర్ ముందు న్నదని గమనించే విధంగా రంగులను వేయించారు. అధికారులందరినీ సమన్వపరుచుకుని సమస్యను పరిష్క రించడంతో తహశీల్దార్ అజ్మతుల్లా ఖాన్‌కు బాలాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, రవీందర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

స్పీడ్ బ్రేకర్ వద్ద సూచక బోర్డు

నాడు-నేడు నిధులు రూ.78 లక్షలు మంజూరు

ప్రజాశక్తి -పిచ్చాటూరు: సర్వే నంబరు 552/1ఏ3లో పూర్తి విస్తరణ 1.68 ఒక ఎకరా 68 సెంట్లు భూమిని పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తహశీల్దార్ మధుసూదన్ సమక్షంలో సర్వే చేసి కేటాయించారు. పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ గోడ నిర్మాణం కోసం తహశీల్దార్ మధుసూదన్ రావు వైసీపీ మండల అధ్యక్షుడు కే హరిచంద్ర రెడ్డి సమక్షంలో సర్వే చేసి హద్దులు ఏర్పరిచారు. పార్టీ అధ్యక్షుడు హరిచంద్ర రెడ్డి మాట్లాడుతూ నాడు -నేడు నిధుల ద్వారా రూ.78 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, దీనికి కారణమైన స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్ రావు, పార్టీ అధ్యక్షుడు హరిచంద్ర రెడ్డి, పాల పద్మనాభం, డిటి వెంకటేశులు, సర్వేర్ కన్నయ్య, ముని రాజా, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.



ప్రహరీ నిర్మాణ కోసం సర్వే చేస్తున్న అధికారులు, నాయకులు

తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రూరల్ మండలంలోని రామకృష్ణాపురం గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లపల్లి, రామకృష్ణాపురం గ్రామంలో రామకృష్ణాపురం గ్రామ సర్పంచ్ విరిత దేవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో తాగునీటి పైపులైన్ల మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలోని ప్రజలకు తాగునీటి సమస్య ఉండకుండా, మరమ్మతుకు గురైన పైప్ లైన్లను మరమ్మతు చేసి. నీటి సౌకర్యం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. పంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజలు క్లాప్ మిత్ర లు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అంజూరును కలిసిన చిల్లకూరు సాయిరెడ్డి

ప్రజాశక్తి-కోట: శ్రీకాళహస్తి ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసరావుని కోట మండలం చెదోడు పంచాయతీ యువ నాయకులు, గూడూరు నియోజకవర్గం వైసీపీ యువత అధ్యక్షులు చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి అంజూరుని శాలువాతో సత్కరించారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు పాలిటెక్నిక్ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీ సుల్తానా బేగం మాట్లాడుతూ మన దేశాన్ని, రాజ్యాంగాన్నిపరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. న్యాయవాదులు అరవపార్వతయ్య, మహబూబ్ బాషా, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు రూరల్: ఆంధ్ర మహిళా మండలి ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్ రోగులకు పౌష్టికాహారం, దుప్పట్లను గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ చేతుల మీదుగా స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఎయిడ్స్ రోగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యురాలు చెరుకూరు రోహిణి మాట్లాడుతూ భవిష్యత్తులో ఇటువంటి కూడా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇన్నర్ విల్ క్లబ్ ఆంధ్ర మహిళా మండలి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నపిల్లలకు ఆటవస్తువులు పంపిణీ

ప్రజాశక్తి- బి.ఎన్.కండ్రిగ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ కె. మాధవి ఆధ్వర్యంలో శుక్రవారం ఆశాడేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశాలకు హోమ్ బేస్డ్ యంగ్ చైల్డ్ కిట్లను 29 మందికి పంపిణీ చేశారు. డాక్టర్ పి వి దివాకర్, సూపర్వైజర్ ఎం సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎం లు, యం ఎల్ హెచ్ పీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

తిరువన్నామలైకు బస్సు సర్వీసులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో నుంచి కార్తీక దీపోత్సవాన్ని పురస్కరించుకుని తిరువన్నామలైకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 6, 7వ తేదీలలో శ్రీకాళహస్తి నుంచి ఉదయం 5 గంటలకు బస్సులు బయల్దేరి గోల్డెన్ టెంపుల్ మీదుగా మధ్యాహ్నం 1:30 గంటకు తిరువన్నామలైకు చేరుతాయని, అదేరోజు రాత్రి 10.30 గంటల తిరుగు ప్రయాణమై మరుసటి రోజు ఉదయం 5 గంటలకు శ్రీకాళహస్తికి చేరుకుంటాయన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గోశాలకు విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వ రాలయ అనుబంధ గోశాలకు ముప్పాళ్ల కృష్ణం రాజు శుక్రవారం రూ.30 వేలు విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కురూపంలో ఆలయ పాలక మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులుకు అందజేసి గోశాల నిర్వహణకు ఖర్చు చేయాల్సిందిగా కోరారు. అనంతరం దాతకు ఆలయ మర్యాదలతో ముక్కంటి దర్శనం చేయించారు.

బాదుడు ప్రభుత్వం పోవాలి.. సైకిల్ ప్రభుత్వం రావాలి..

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : వైసీపీ పాలనలో గడపగడపలో కరెంటు బిల్, ఇంటి పన్నులు, చెత్త పన్నులు షాక్ కొడుతున్నాయని, ప్రజల కష్టాలు తీరాలంటే బాదుడు ప్రభుత్వం పోయి సైకిల్ ప్రభుత్వం రావాలని నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గాలి భాను ప్రకాష్ అన్నారు.. శుక్రవారం రూరల్ మండలంలో గోపాలకృష్ణాపురం పంచాయతీ పైడిపల్లి. దళితవాడ ఆది ఆంధ్రవాడ ఆనంబట్టు, తొర్రూరు గ్రామం హరిజనవాడలో మీ కోసం-మీ తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అనుబంధ సంఘ కమిటీ సభ్యులు, అభిమానులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): రాష్ట్రంలో నేడు నిత్యవసర ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా ఉన్నాయని, వెంటనే నిత్యవసర వస్తువుల ధరలను అదుపు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మంగళం పరిధిలోని మంగళం పంచాయతీలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళం పంచాయతీ ప్రజలకు ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళం పంచాయతీలో నివాసం ఉన్న ప్రజల వద్దకు వెళ్లి గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇలాంటి పరిస్థితులు స్థానిక మహిళలు, ప్రజలు ఎదుర్కొంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, అమిలినేని మధు, కృష్ణమూర్తి రెడ్డి, పేరూరు శీను, పి.భాస్కర్ రెడ్డి, కత్తిసుధా, సురేంద్ర, సురేష్ నాయుడు, చలపతి, రాధయ్య, రామ్మూర్తి యాదవ్, నాగ, శశి, సిద్ధారెడ్డి, రామకృష్ణ, కుల్లాయప్ప, బుజ్జి, మహేశ్వరి, కనకదుర్గ, లీలావతి, రానెమ్మ, భారతి, దీప పాల్గొన్నారు.

తొట్టంబేడు: మండలంలోని కాసరం పంచాయతీ నుంచి మొదటిగా మండల పార్టీ అధ్యక్షుడు గాలి మురళి నాయుడు, రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడుల ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఇదేం ఖర్మ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఇంటింటా తిరిగి 14 అంశాల పైన "ఈ ప్రభుత్వంలో మిమ్మల్ని బాధించే అంశాలు ఏవి?' అంటూ ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేసి నేటి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల నుంచి తెలుసుకున్నారు. పార్టీ సీనియర్ నాయకులు, భాస్కర్ నాయుడు, మాజీ సర్పంచులు చెంచయ్య, విమలమ్మ, మాజీ ఎంపీటీసీ మాధవయ్య, సంపూర్ణమ్మ, నాయకులు రాఘవులు, గిరి ఎస్సీ సెల్ నాయకులు, బాలాజీ వెంకటసుబ్బయ్య నియోజకవర్గ పరిశీలకులు మలిశెట్టి, వెంకటేశ్వర్లు పార్లమెంటు నాయకులు ప్రకాష్ నాయుడు, చక్రాల ఉష, దశరథచారి, ముని రాజా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం : మండల పరిధిలోని తల్లంపాడు గ్రామంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి సూళ్లూరుపేట నియోజకవర్గం పరిశీలకురాలు పర్వీన్ ముంతాజ్ వారి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా తల్లంపాడు గిరిజన కాలనీ నుంచి ప్రారంభించి ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచక పనుల గురించి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే గిరిజన కాలనీ కుటుంబీకులు అందరూ తమ కాలనీలో ఇప్పటివరకు కనీసం వీధిలైట్లు కూడా మరమ్మతు చేసి వాటిని వెలిగించిన దాఖలు లేవని రాత్రి సమయంలో చీకట్లో బతుకుతున్నామని తెలిపారు. ఇసక గ్రావుల్ మాఫియా గురించి తెలిపారు. దొరవారిసత్రం మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు మండల ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరుపతి పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ దారా రాజేంద్ర మండల నాయకులు పాల్గొన్నారు

శ్రీకాళహస్తి: నిరుద్యోగం, అవినీతిలో ఏపీ ప్రభుత్వం టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి విమర్శించారు. టిడిపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని ఐదవ వార్డులో 'ఇదేం ఖర్మ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సందర్భంగా జగన్ పాలనపై సుధీర్ రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నిత్యావసర సరుకులు, విద్యుత్, ఆర్టీసీ, ఇంటిపన్ను ఇలా అన్ని రకాల ధరలు పెరిగి పోయాయన్నారు. అవినీతి, నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. జగన్ ప్రభుత్వం ఇంటికి పంపితేనే రాష్ట్రం తిరిగి గాడిలో పడుతుందని హితవు పలికారు. పట్టణాధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు, గాలి చలపతి నాయుడు, కంఠ రమేష్, దశరథాచారి తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఎర్రచందనం దుంగలు స్వాధీనం -స్మగ్లర్ అరెస్టు

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: అటవీ శాఖ సిబ్బందికి అందిన రహస్య సమాచార మేరకు తలకోన నార్త్ బీట్ కాటుక కణం ప్రదేశంలో కూంబింగ్ నిర్వహించారు. ఈ కూంబింగ్లో భాగంగా గురువారం రాత్రి 11:30 గంటల ప్రాంతంలో ఎల్లమంద ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ తన సిబ్బందితో కలిసి దాడి చేయగా స్మగ్లర్లు మోసుకొస్తున్న ఎర్రచందనాన్ని కిందపడేసి పొదల్లో పారిపోతుండగా ఒక తమిళ స్మగ్లర్ని పట్టుకున్నట్లు శుక్రవారం విలేకరుల సమావేశంలో అటవీ శాఖ క్షేత్రాధికారి దత్తాత్రేయ తెలిపారు. 5 ఎర్రచందనం కొయ్యలతో పాటు తమిళనాడుకు చెందిన ఇజామలై రాజు(27) అనే తమిళ స్మగ్లర్లను పట్టుకోగా మిగతా స్మగ్లర్లు పారిపోవడం జరిగిందని వారు తెలిపారు. పట్టుబడ్డ ఎర్రచందనం బరువు 87 కేజీలు ఉండగా వీటి విలువ సుమారు రెండు లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వారు తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్ఓ, సల్లావుద్దీన్, ఎఫ్‌బిఓలు, రాజేష్, ప్రదీప్ చాంద్, డ్రైవర్ శంకర్, బేస్కాం ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

ప్రజాశక్తి- దొరవారిసత్రం : మండల పరిధిలోని నెలబల్లి రెస్ట్‌ఏరియా సమీపాన ఉన్న జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తుపాకుల మునస్వామి (35) సునీత(25) అను భార్యాభర్తలు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మృతులు దొరవారిసత్రం మండల పరిధిలోని నెల్లూరుపల్లి గ్రామానికి చెందినవారు. వీరు ద్విచక్ర వాహనంపై తమ సొంత పనిపై కోట గ్రామానికి వెళ్లి వస్తూ ఉండగా నెలపల్లి గ్రామ సమీపాన ఉన్న రెస్ట్ ఏరియా వద్దకి రాగా లారీ బైకును ఓవర్ టాక్ చేస్తూ ఉండగా లారీ వెనుక చక్రం ఢీకొనడంతో బైకుతో సహా ఇద్దరూ పడిపోయారు. ఈ ఇరువురిని లారీ వెనకటైరు ఎక్కేయడంతో భార్యాభర్తలు అక్కడకక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులకు ఇద్దరు పిల్లలున్నారు. వీళ్ళ మృతి పట్ల గ్రామస్తులు, బంధువులు, కుటుంబీకులు, వారి పిల్లలను చూస్తూ దిక్కులేని పిల్లలు అయ్యారంటూ కన్నీరు మున్నీరుగా ఏడవ సాగారు. ఈ కేసును హెడ్ కానిస్టేబుల్ బాలసుబ్రమణ్యం నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా తెలిపారు

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దుకాణాల్లో నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనరు బాలాజీనాయక్ హెచ్చరించారు. పట్టణంలోని హోటళ్లు, బేకరీల్లో జరిగే అక్రమాలు గురించి జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ ఛైర్మన్ వై.కోటేశ్వరబాబు ఇటీవల తిరుపతి కలెక్టరు వెంకట్రమణారెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావుకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో దుకాణాలు తనిఖీ చేయాలని పురపాలక సంఘం కమిషనరు బాలాజీ నాయక్‌ను వారు ఆదేశించారు. వారి ఆదేశాల మేరకు బాలాజీ నాయక్ శుక్రవారం పురపాలక సంఘం పరిధిలోని పలు హోటళ్లు, బేకరీలపై తన సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. నిబంధనలు పాటించని దుకాణదారులకు జరిమానా విధించారు. బాలాజీ నాయక్ మాట్లాడుతూ హోటళ్లు, బేకరీలలో తప్పకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. శుభ్రత పాటించకపోతే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు.

సహకార బ్యాంకు అకౌంట్‌తో జీవిత బీమా సౌకర్యం

ప్రజాశక్తి-గూడూరు రూరల్: కేంద్ర సహకార బ్యాంకు, గూడూరు బ్రాంచ్ వారు చెన్నూరు, కడివేడు శాఖల ఆధ్వర్యంలో నాబార్డ్ వారి సౌజన్యంతో వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) సౌజన్యంతో అందించే పథకాలు, వాటి ప్రయోజనాలను ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం ద్వారా చెన్నూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ వెంకట్ మాట్లాడుతూ సహకార బ్యాంకులలో అకౌంట్ ఓపెన్ చేయడం వల్ల జీవిత బీమా సౌకర్యం, ప్రమాద బీమా సౌకర్యం, రూపే కార్డు సౌకర్యం, ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యం ఉంటుందన్నారు. సూపర్వైజర్ గురునాథం మాట్లాడుతూ నెల్లూరు ఈ సదవకాశాన్ని వినియోగించు కోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఎఫ్ఎల్‌సి గురు స్వామి, గూడూరు బ్యాంక్ సూపర్‌వైజర్ సుధీర్, గూడూరు నెంబర్ 24 సీఈవో నారాయణ చిల్లకూరు సొసైటీ సీఈఓ మజీద్, సంఘ సిబ్బందిని పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన చక్రవర్తి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక ప్రత్యేక కార్యదళం ఎస్పీగా కె.చక్రవర్తి శుక్రవారం కపిలతీర్థం వద్దగల టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో బాధ్యత చేపట్టారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎస్పీ చక్రవర్తికి శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న చక్రవర్తిని పదోన్నతిపై టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఎస్పీ చక్రవర్తి మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటానని, శేషాచలం అడవుల్లోకి వచ్చే స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపడానికి తగిన కార్యచరణను రూపొందించి ప్రత్యేక వ్యూహాలతో ముందుకెళ్తామన్నారు. బాధ్యతల స్వీకరాణంతరం టాస్క్‌ఫోర్స్ అధికారులతో సమావేశమయ్యారు.

నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - కోట: ఆంధ్రప్రదేశ్ బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ఛైర్మన్, తిరుపతి జిల్లా అధ్యక్షులుగా నేదరుమల్లి రాంకుమార్ రెడ్డి బాధితులు స్వీకరించిన సందర్భంగా మొట్టమొదటగా తన స్వగ్రామానికి వచ్చిన నేపథ్యంలో విద్యానగర్‌లో దేవారెడ్డి, మాధవి భర్త సీనియర్ వైసీపీ నాయకులు దేవా రెడ్డి నాగూర్ రెడ్డి ఆధ్వర్యంలో అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా కోట క్రాస్ రోడ్డులో వైసీపీ యువ నాయకులు నేదురుమల్లి హరిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా నేదురుమల్లి.రాంకుమార్ రెడ్డి ఫోటో ఉన్న ఫ్రేమ్‌ను అందజేసి నేదురుమల్లి అందజేశారు. దీంతో రామ్ కుమార్ రెడ్డి హరీష్ చంద్రా రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నేదురుమల్లిని కలిసిన మాజి జెడ్పీటీసీ సభ్యుడు

బాలాయపల్లి: గూడూరు రూరల్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన మాజీ బీసీ సెల్ అధ్యక్షుడు, మాజి జెడ్పీటీసీ సభ్యుడు గట్టుకు శ్రీనివాసులు యాదవ్ తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షులుగా నియమితులైన నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డిని కలిశారు.నేదురుమల్లి కుటుంబంకు సన్నిహితంగా ఉండేవారు.

విద్యుత్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం

ప్రజాశక్తి -బి.ఎన్.కండ్రిగ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వైసీపీ మండల కన్వీనర్ ఆరని రెడ్డి అధ్యక్షతన మండల మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యవేడు శాసనసభ సభ్యులు కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లమాల పంచాయితీ, నీర్పాకోట పంచాయతీలలో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు వారివారి గ్రామాల్లో ఉన్న సమస్యలు తెలియజేయడంతో వాటిని పరిష్కారం మీద శాసనసభ్యులు అధికారులపైన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కువగా విద్యుత్ సమస్యపై పలువురు ఎంపీటీసీలు సర్పంచులు శాసనసభ్యులకు ఫిర్యాదు చేయగా చివరగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పందించివాటిని త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.